మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 185
పేజీలు : 3

శుక్రవారం
30.01.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఎర్రవల్లిలోనే సిట్ విచారణ చేయాలి

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



**టిమీడియా,జనవరి29, హైదరాబాద్ బ్యూరో:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. సిట్ అధికారులు నోటీసులో పేర్కొన్న రోజున తాను విచారణకు హాజరు కాలేనని ఆయన తెలిపారు. నందినగర్‌లోని తన నివాసంలో అధికారులు నోటీసులు ఇవ్వడంపై గులాబీ అధినేత ప్రత్యుత్తరం రాశారు. శుక్రవారం విచారణ కుదరని ఆయన పోలీసులకు వివరించారు. అంతేకాదు తనను ఎర్రవల్లిలోనే మరోరోజు విచారణ చేయాలని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.సిట్ అధికారులు గురువారం తనుకు నోటీసులు జారీ చేయడంపై కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నేతగా సిట్ విచారణకు పూర్తిగా సహకరిస్తానని ఆయన తెలిపారు. అయితే.. సిట్ అధికారులు కోరినట్టు నందినగర్‌లో శుక్రవారం విచారణకు హాజరుకాలేనని, మరో రోజున తనను ఎర్రవల్లిలోనే విచారించాలని కేసీఆర్ తన లేఖలో వెల్లడించారు




## ఏపీపై రుణభారం...
# రూ.4.33 లక్షల కోట్లు

- కట్టాల్సిందేనని ఆర్‌బీఐ నివేదిక

**టీ మీడియా, జనవరి 29 , ఢిల్లీ బ్యూరో:** రిజర్వ్ బ్యాంక్ వివిధ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై తాజాగా వెలువరించిన నివేదిక ఈ అంశాన్ని విశ్లేషించింది. దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాలు రిజర్వ్ బ్యాంక్ నుంచి ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో సెక్యూరిటీల వేలంలో తీసుకున్న రుణాలు తీరాలంటే 2064వ సంవత్సరం రావాల్సిందే అంటున్నారు సంబంధిత నిపుణులు. అంటే, ఈ అప్పు తీరేందుకు మరో 38 ఏళ్లు పడుతుందన్నమాట. కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతి రాష్ట్రానికి రుణాలు తీసుకునేందుకు అనుమతులిస్తుంది. ఆ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువను లెక్కించి, అందులో 3% వరకు రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు తీసుకునేందుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి ఇస్తూ ఉంటుంది.ఈ అనుమతులు రెండు విడతలుగా అంటే ముందు అర్థ సంవత్సరానికి, తర్వాత రెండు త్రైమాసికాలకు వేర్వేరుగా లభిస్తాయి. ఇందుకు అనుగుణంగా ఆర్‌బీఐ సెక్యూరిటీల వేలం వేసి, ఆయా ప్రభుత్వాలకు రుణాలు సమకూరుస్తుంది. రాష్ట్ర విభజనకు ముందు నుంచీ వివిధ ప్రభుత్వాలు సెక్యూరిటీల వేలం రూపంలో చేసిన అప్పులు, విభజన సమయంలో ఏపీకీ వాటాగా సంక్రమించాయి. ఆ తర్వాతి ప్రభుత్వాలు కూడా ఏటా రుణాలు తీసుకుంటూనే, మరోవైపు పాత అప్పులకు అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తున్నాయి. ఇలా ఒక్క సెక్యూరిటీల రూపంలోనే ఏపీపై 2025 మార్చి 31 వరకు ఉన్న భారం రూ.4,33,443 కోట్లుగా ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ఈ అప్పు తీరాలంటే 2064 వరకు ఏటా కొంతమొత్తం చొప్పున చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొంది.ఈ ఐదేళ్లలోనే రూ.93,982 కోట్లు కట్టాలి!: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి రుణాలు తీర్చాలంటే రూ.93,982 కోట్లు అవసరం. ఈ ఒక్క అప్పు తీర్చాలంటేనే రాష్ట్ర బడ్జెట్‌పై ఏటా సుమారు రూ.20 వేల కోట్ల భారం పడుతుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందుకు రూ.20,050 కోట్లు కేటాయించారు. వచ్చే ఏడాది రూ.18,109 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. 2028-29, 2029-30 ఆర్థిక సంవత్సరాల్లోనూ ఏటా రూ.20 వేల కోట్లకు మించి కేటాయించాల్సి ఉంటుంది. మొత్తం అప్పులో ఏడాది లోపు తీర్చగలిగేది 4.6%, ఐదేళ్ల లోపు కట్టగలిగేది 17.1%, 5-10 ఏళ్ల గడువులో చెల్లించేది 27%. 10-20 ఏళ్ల వ్యవధిలో తీర్చాల్సిన అప్పు 47.8 శాతంగా ఉన్నట్లు ఆర్‌బీఐ విశ్లేషించింది.ఇది కేవలం సెక్యూరిటీల వేలం ద్వారా సేకరించిన అప్పులకు సంబంధించింది మాత్రమే. ప్రావిడెంట్ ఫండ్, నాబార్డ్, ఇతర బాండ్లు, విద్యుత్ సంస్థల బకాయిలు, కార్పొరేషన్ల రుణాలు వంటివి కూడా భారంగా పరిణమిస్తున్నాయి. బడ్జెట్‌లో సింహభాగం సెక్యూరిటీ వేలం ద్వారా తీసుకున్న అప్పులు, వాటికి వడ్డీలు, ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకే సరిపోతుంది. వీటికితోడు గత ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతభత్యాలు, ఆర్థిక ప్రయోజనాలు సహా గుత్తేదార్ల బిల్లులు భారీగా బకాయిలు పెట్టింది.రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత లెక్కల ప్రకారం 2040 నుంచి 2064 మధ్య దాదాపు రూ.లక్ష కోట్ల సెక్యూరిటీ రుణాల భారం మోయాల్సి ఉంటుంది. ఆ 24 ఏళ్లలో రూ.99,293 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ప్రస్తుతం ఈ భారం.. మొత్తం అప్పులో 4.5%గా ఉంది. 2030 వరకూ దాదాపు ఇదే లెక్కన అప్పులు కడుతూ పోవాల్సిందే. ఆ తర్వాత అది ఏటా 5.5 శాతానికి పెరగవచ్చని అంచనా.

# సమాజాన్ని చీల్చే ప్రమాదం

- యుజిసి కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే




**టీ మీడియా, జనవరి 29 , ఢిల్లీ బ్యూరో:** ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ భావనను పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇటీవల తీసుకొచ్చిన నూతన నిబంధనలు వివాదాస్పదంగా ఉన్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కొత్త నిబంధనలపై అత్యున్నత ధర్మాసనం స్టే విధించింది. నిబంధనల్లో స్పష్టత లేకపోవడం, దుర్వినియోగానికి అవకాశం ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసిన అత్యున్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వం, యూజీసీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ నిబంధనలు అమల్లో ఉండవని స్పష్టం చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొత్త నిబంధనలను నిలిపివేయాలని యూజీసీ, కేంద్రాన్ని ఆదేశించింది.చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యూజీసీ నోటిఫై చేసిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం) నిబంధనలు--2026 సమాజాన్ని విభజించేలా ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. "మేము జోక్యం చేసుకోకపోతే ఇది ప్రమాదకర పరిణామాలకు దారి తీస్తుంది. సమాజాన్ని చీల్చే ప్రభావం చూపిస్తుంది" అని ధర్మాసనం స్పష్టం చేసింది.ఈ నెల 13న యూజీసీ ఈ కొత్త నిబంధనలను ప్రకటించింది. వీటి ప్రకారం దేశవ్యాప్తంగా అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో ఈక్విటీ కమిటీలు, ఈక్వల్ అపార్చునిటీ సెంటర్లు ఏర్పాటు చేయడం తప్పనిసరి. అయితే, ఈ నిబంధనల్లోని కొన్ని అంశాలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. ముఖ్యంగా సాధారణ వర్గాల (జనరల్ కేటగిరీ) విద్యార్థులకు ఫిర్యాదు చేసే హక్కు లేకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ కారణంగానే దేశంలోని పలు రాష్ట్రాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ నిబంధనలు ఏకపక్షంగా ఉన్నాయని, దుర్వినియోగానికి అవకాశం ఉందని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు, నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయని పేర్కొంది. నిపుణులు వీటిని పునఃపరిశీలించి మార్పులు చేయాల్సిన అవసరం ఉందని, లేకపోతే దుర్వినియోగం జరిగే ప్రమాదం ఉందని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.కోర్టు మరో కీలక అంశాన్ని కూడా ప్రస్తావించింది. నిబంధనల్లోని సెక్షన్ 3(సి) ప్రకారం కుల వివక్షను కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలపై జరిగే వివక్షగానే నిర్వచించడంపై కోర్టు అభ్యంతరం తెలిపింది. అదే సమయంలో సెక్షన్ 3(ఈ)లో వివక్షను మతం, జాతి, లింగం, పుట్టిన ప్రదేశం, కులం వంటి అన్ని అంశాల ఆధారంగా నిర్వచించారని గుర్తించింది. పిటిషనర్ల తరఫున వాదించిన న్యాయవాదులు, నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని పేర్కొన్నారు. అన్ని పౌరులకు సమాన రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్రానిదని, కానీ ఈ నిబంధనలు సాధారణ వర్గాలను పూర్తిగా పక్కనపెట్టాయని వాదించారు. ఇది సమానత్వం కంటే విభజనకు దారి తీస్తుందని తెలిపారు.

### నిబంధనలు వెనుకడుగు వేసినట్లుగా!

విచారణ సందర్భంగా జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. "విశ్వవిద్యాలయాల్లో స్వేచ్ఛాయుత, సమాన వాతావరణం ఉండాలి. కానీ ఈ నిబంధనలు వెనుకడుగు వేసినట్లుగా కనిపిస్తున్నాయి" అన్నారు. అలాగే 2026 నిబంధనల్లో రాగింగ్ అంశాన్ని ఎందుకు పొందుపరచలేదని ప్రశ్నించారు. మరోవైపు, 2019లో రోహిత్ వేముల, పాయల్ తడ్వి తల్లులు దాఖలు చేసిన పిల్ ఆధారంగానే నిబంధనలు రూపొందాయని సీనియర్ అడ్వకేట్ ఇందిరా జైసింగ్ కోర్టుకు తెలిపారు. కుల వివక్షను పూర్తిగా నిర్మూలించాలన్న రాజ్యాంగ లక్ష్యంతోనే ఈ నిబంధనలు వచ్చాయని ఆమె వాదించారు. అయితే, అన్ని వాదనలు విన్న తర్వాత సుప్రీంకోర్టు 2026 యూజీసీ నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేస్తూ, అంతవరకు 2012లో ఉన్న పాత నిబంధనలు అమల్లో కొనసాగుతాయని ఆదేశించింది. ఈ అంశంపై తదుపరి విచారణ మార్చి 19న జరగనుంది.

## తెలుగు రాష్ట్రాల్లో..
# ద్రవ్యోల్బణం తగ్గుతూవస్తోంది

- ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్




**టీ మీడియా, జనవరి 29, ఢిల్లీ బ్యూరో :** ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన 7.4 శాతం కంటే కాస్త తక్కువ. ప్రపంచ అనిశ్చితుల మధ్య స్థిరమైన వృద్ధి అంచనా, జాగ్రత్తపరమైన అవసరమే, కానీ నిరాశావాదం కాదని సర్వే వెల్లడించింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక సర్వేలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధి ప్రస్తావించారు. తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఏటా తగ్గుతూవస్తోందని పేర్కొంది. తెలంగాణలో ద్రవ్యోల్బణం 8.61 నుంచి 0.20 శాతానికి తగ్గగా, ఏపీలో ద్రవ్యోల్బణం 7.57 నుంచి 1.39 శాతానికి దిగివచ్చిందని వెల్లడించింది.సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరు, రానున్న సంవత్సరంలో ఎదురయ్యే సవాళ్లను అంచనా వేస్తూ ఎకనామిక్ అఫైర్స్ విభాగంలోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందించింది. ఇటీవలి సంవత్సరాల్లో తీసుకున్న విధానపరమైన సంస్కరణల ప్రభావాన్ని వృద్ధి అంచనా పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించింది. లోక్‌సభలో ఆర్థికసర్వే ప్రవేశపెట్టిన అనంతరం సభను ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదా వేశారు.

# జగన్‌కు అధికారం సరికాదు

- గతంలో ఇస్తే ఏం చేశారు : వైఎస్ షర్మిల



**టీ మీడియా, జనవరి 29 , విజయవాడ :** వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ పాదయాత్ర చేయనున్నట్లు ప్రకటించడంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. అధికారం కోసమే జగన్ పాట్లు అంటూ ఎద్దేవా చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో షర్మిళ మాట్లాడుతూ అధికారం ఇస్తే ఏం చేశారని ప్రశ్నించారు. జలయజ్ఞం పూర్తి చేయగలిగారా, నవరత్నాల్లో పెట్టిన హామీలను అమలు చేశారా, మద్యనిషేధం అమలు చేశారా అంటూ నిలదీశారు. రుషికొండను బోడిగుండు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఇస్తే ఒక్క రోజు కూడా బయటకు రాలేదని, ఇంకా ఆ పార్టీ వాళ్లకే అందుబాటులో లేరని గుర్తు చేశారు. జగన్?లో మార్పు రావాలని అలానే స్వార్థం తగ్గి మంచితనం పెరిగితే అప్పుడు దేవుడు అధికారం ఇస్తాడేమోనని వ్యాఖ్యానించారు. ఏడాదిన్నర తర్వాత చేసే పాదయాత్రకు ఇప్పుడు ప్రకటనలు ఎందుకని షర్మిళ ప్రశ్నించారు.

### బండ్లపల్లి నుంచి మళ్లీ యాత్ర

మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 2 నుంచి యాత్ర చేపడుతున్నట్లు షర్మిళ వెల్లడించారు. ఫిబ్రవరి 2 నాటికి మహాత్మాగాంధీ ఉపాధి హామీ ఫథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా అప్పట్లో పథకం ప్రారంభమైన శింగనమల నియోజకవర్గం బండ్లపల్లి నుంచి మళ్లీ యాత్రను ప్రారంభిస్తున్నామని చెప్పారు. అన్ని జిల్లాలో యాత్ర కొనసాగుతుందని తనే స్వయంగా అన్ని జిల్లాలో పర్యటిస్తున్నట్లు షర్మిళ చెప్పారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం కొనసాగించాలని కూలీల రోజువారీ వేతనాన్ని 400కు పెంచాలని డిమాండ్ చేశారు.

# రాహుల్, ఖర్గేలతో భేటీ సక్సెస్

- మేమంతా ఒక్కటే : క్లారిటీ ఇచ్చిన శశి థరూర్



**టీ మీడియా, జనవరి 29 , ఢిల్లీ బ్యూరో:** గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, ముఖ్యంగా అగ్రనేత రాహుల్ గాంధీ తీరుపై అసంతృప్తితో ఉన్నారనే వార్తల మధ్య సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ ఎట్టకేలకు స్పందించారు. గురువారం ఆయన దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలతో అత్యంత కీలకమైన సమావేశం నిర్వహించారు. భేటీ అనంతరం బయటకు వచ్చిన థరూర్, "అంతా బాగుంది. పార్టీ నాయకత్వంతో నాకు ఎలాంటి విభేదాలు లేవు. మేమంతా ఒకే మాటపై ఉన్నాం. కలిసి ముందుకు సాగుతాం" అని ప్రకటించారు.

### పార్లమెంట్ సముదాయంలో గంటపాటు చర్చలు

ఈ కీలక సమావేశం పార్లమెంట్ భవన సముదాయంలోని మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో జరిగింది. సుమారు గంటకు పైగా ఈ భేటీ కొనసాగింది. ఇందులో రాహుల్, ఖర్గేలతో పాటు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. తమ మధ్య ఉన్న మనస్పర్థలు, కేరళ రాజకీయాలు, పార్టీ వ్యూహాలపై వారు కూలంకషంగా చర్చించారు. "మా ఇద్దరు అగ్రనేతలతో (ఖర్గే, రాహుల్) చర్చలు జరిపాను. సమావేశం చాలా నిర్మాణాత్మకంగా, సానుకూలంగా జరిగింది" అని థరూర్ మీడియాకు వెల్లడించారు.

### సీఎం రేసులో లేను

త్వరలో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై చర్చ జరిగిందా? అని విలేకరులు ప్రశ్నించగా, థరూర్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. "ఆ విషయం అసలు చర్చకు రాలేదు. సీఎం రేసులో ఉండటానికి, అభ్యర్థిగా ఉండటానికి నాకు ఆసక్తి లేదు. ప్రస్తుతం నేను తిరువనంతపురం ఎంపీగా ఉన్నాను. అక్కడి ఓటర్ల విశ్వాసం నాపై ఉంది. పార్లమెంటులో వారి ప్రయోజనాలను కాపాడటమే నా బాధ్యత. నా పని నేను చేసుకుంటాను" అని ఆయన క్లారిటీ ఇచ్చారు. అధిష్టానంతో జరిగిన భేటీ పట్ల తాను పూర్తి సంతృప్తితో ఉన్నట్లు తెలిపారు.

### అసలు గొడవ ఎందుకు?

గత వారం పార్టీ కీలక వ్యూహరచన సమావేశానికి థరూర్ వెళ్లకపోవడంతో వివాదం బయటపడింది. ఆయన పార్టీపై కోపంతో ఉన్నారని వార్తలు వచ్చాయి. జనవరి 19న కొచ్చిలో జరిగిన 'మహా పంచాయత్' కార్యక్రమంలో రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు థరూర్‌ను నొప్పించింది. స్థానిక సంస్థల విజేతలను సత్కరించే ఆ సభలో, రాహుల్ గాంధీ వేదికపై ఉన్న ఇతర నేతల పేర్లను ప్రస్తావించారు. కానీ నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన, సీడబ్ల్యూసీ సభ్యుడైన థరూర్ పేరును మాత్రం రాహుల్ ప్రస్తావించలేదు. పక్కనే ఉన్నా తనను పట్టించుకోకపోవడం, కేరళ రాష్ట్ర నేతలు తనను పదే పదే పక్కన పెట్టడం వంటి చర్యలతో థరూర్ తీవ్ర ఆవేదనకు గురయ్యారని వార్తలు చెక్కర్లు కొట్టాయి.

### విదేశాంగ విధానంపై రగడ

ఇది మాత్రమే కాదు, గతంలో భారత్-పాక్ సంబంధాలు, పహల్గాం దాడి విషయంలో థరూర్ చేసిన వ్యాఖ్యలు కూడా వివాదానికి కారణమయ్యాయి. ఆయన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ లైన్‌కు భిన్నంగా ఉన్నాయంటూ సొంత పార్టీ నేతలే విమర్శించారు. ఆయన ఉద్దేశాలను ప్రశ్నించారు. అయితే విదేశాంగ విధానం విషయంలో పక్షపాతం ఉండకూడదని, దేశ ప్రయోజనాలే ముఖ్యమని థరూర్ తన వాదనకు కట్టుబడి ఉన్నారు. థరూర్‌ను బుజ్జగించిన తర్వాత కాంగ్రెస్ హైకమాండ్ ఇప్పుడు కేరళ ఎన్నికలపై దృష్టి సారించింది. శుక్రవారం మల్లికార్జున ఖర్గే కేరళ నేతలతో మరో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఎన్నికల వ్యూహాలను ఖరారు చేయనున్నారు. కాగా 4 సార్లు ఎంపీగా గెలిచిన థరూర్, ఇటీవల పలు సందర్భాల్లో ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. దీనిపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే.

# లోయలోకి దూసుకెళ్లబోయిన బస్సు

**టిమీడియా,జనవరి29, సిమ్లా:** పర్యాటకులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పింది. కింద నది ఉన్న లోయలోకి దూసుకెళ్లబోయింది.) అదృష్టవశాత్తు అందులోని పర్యాటకులకు పెను ప్రమాదం తప్పింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిమాచల్ ప్రదేశ్‌లోని కులు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం చన్నిఖోడ్ సమీపంలోని భూంతర్-మణికరణ్ రహదారిపై పర్యాటకులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పింది. రోడ్డు నుంచి జారి లోయలోకి దూసుకెళ్ల బోయింది. అదృష్టవశాత్తూ బస్సు ముందు భాగం రోడ్డుపైకి వచ్చి ఆగింది. దీంతో లోయ కింద ప్రవహిస్తున్న పార్వతి నదిలో ఆ బస్సు పడే ప్రమాదం తప్పింది.కాగా, ఆ బస్సులోని ప్రయాణికులు ఆందోళన చెందారు. భయంతో కేకలు వేశారు. స్థానికులు వెంటనే స్పందించారు. బస్సులోని పర్యాటకులను సురక్షితంగా కిందకు దించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రయాణికులు క్షేమంగా ఉండటంతో అంతా ఊరట చెందారు. లోయలోకి జారుతున్నట్లుగా ఉన్న బస్సు వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



# రాజకీయ ఉద్దేశ్యం లేదు

- ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**టిమీడియా,జనవరి29, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ మాజీ ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు నోటీసు జారీ చేయడంలో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్‌కు సిట్ అధికారులు నందినగర్ నివాసంలో గురువారం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విషయంలో అందరినీ విచారిస్తేనే సమగ్ర దర్యాప్తు సాధ్యమవుతుందని తెలిపారు.పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు(Panjagutta Police Station) సంబంధించిన క్రైమ్ నంబర్ 243/2024 కేసు విషయంలో బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో ఉన్న కేసీఆర్ నివాసంలో సిట్ నోటీసు జారీ చేసిన సమయంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఆ నోటీసులో, సెక్షన్లు 166, 409, 427, 201, 120 (బి) ఐపీసీతో పాటు 34వ సెక్షన్, పీడీపీపీ చట్టంలోని సెక్షన్ 3, ఐటీ చట్టం 2000లోని సెక్షన్లు 65, 66, 66 (ఎఫ్)(1)(బి)(2), 70 కింద నమోదు చేసిన కేసులో విచారణ నిమిత్తం తమ ముందు హాజరు కావాలని సిట్ కేసీఆర్‌ను కోరింది.

# ముందే సమాచారం లీక్?

**• కోట్లు సంపాదించిన హోంగార్డు**



**టి మీడియా, జనవరి 29 , విజయనగరం :** అతనో సాధారణ ప్రభుత్వ ఉద్యోగి. కానీ అతని ఆస్తుల విలువ రూ.20 కోట్ల వరకు ఉంటుంది. ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి ఇన్ని కోట్ల రూపాయలు ఎలా సంపాదించాడనుకుంటున్నారా. ఇదంతా అతను అక్రమంగా సంపాదించినదే. అతను ఏసీబీలో హోంగార్డుగా పనిచేసే సమయంలో ఏసీబీ దాడులకు ముందే ఎదుటి వారికి సమాచారం ఇచ్చి కోట్లు సంపాదించాడు. ఇలా అతను 15 ఏళ్లపాటు ఏసీబీలో విధులు నిర్వర్తించి సంపాదించిన అక్రమార్జన. అతను ఎవరో కాదు విజయనగరానికి చెందిన హోంగార్డ్ నెట్టి శ్రీనివాసరావు.అక్రమార్కులపై ఏసీబీ దాడులకు ముందే వారికి సమాచారం ఇచ్చి కోట్లు కూడబెట్టుకున్న హోంగార్డుపై అవినీతి నిరోధక శాఖ పంజా విసిరింది. విజయనగరంలో ఉంటున్న హోంగార్డ్ నెట్టి శ్రీనివాసరావు దాదాపు 15 ఏళ్లపాటు ఏసీబీలో హోంగార్డుగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా పని చేస్తున్నారు. శ్రీనివాసరావుపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీలో ఉంటూ అవినీతి అధికారులకు ముందే సమాచారం ఇచ్చి పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. సుమారు 20 కోట్ల రూపాయల వరకు సంపాదించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఏడాది క్రితం శ్రీనివాసరావును జిల్లా పోలీస్ కార్యాలయానికి ఏసీబీ సరెండర్ చేసింది. శ్రీనివాసరావుపై వచ్చిన ఫిర్యాదులపై దృష్టి పెట్టిన ఏసీబీ ఈ ఉదయం ఎస్.కోటలోని ఆయన నివాసంతో పాటు విజయనగరం, గుర్ల, విశాఖలో 2 చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టింది. శ్రీనివాసరావు అక్రమాస్తుల వివరాలు సేకరిస్తోంది.

నెల్లూరు జిల్లాలో తనిఖీలు

అదే విధంగా నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం డీసీ పల్లెలోని ఎస్సీ కాలనీలో నల్లిపోగు శ్రీను ఇంటితో పాటు పలువురు ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇటీవల తిరుపతి జిల్లా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆఫీస్ అటెండెంట్?గా పనిచేస్తున్న తిరుమలేశుపై, ఏసీబీ అధికారులు అక్రమ ఆస్తుల కేసు నమోదు చేశారు. ఆయన సొంతూరు డీసీ పల్లె ఎస్సీ కాలనీ కావడంతో కోర్టు అనుమతితో, ఆయన బంధువుల ఇళ్లలో సోదాలు జరిపారు.

## సజావుగా సాగుతున్న నామినేషన్ల ప్రక్రియ



**టిమీడియా,జనవరి29,రామగుండం:** పురపాలక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జిల్లాలో సజావుగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ రామగుండం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముబారక్ నగర్, సప్తగిరి కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 60 డివిజన్ లకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం రామగుండంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశామని, పురపాలక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా జరుగుతున్నట్లు తెలిపారు. జనవరి 30 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, జనవరి 31న నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి సరిగ్గా నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. నామినేషన్ తిరస్కరించిన అభ్యర్థులు ఫిబ్రవరి 1న సాయంత్రం 5 గంటల వరకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, సదరు అప్పీల్స్ ను ఫిబ్రవరి 2న పరిష్కరిస్తామని, ఫిబ్రవరి 3 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, ఫిబ్రవరి 3 సాయంత్రం పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తుంబురేశ్వర స్వామి ఉత్సవలు



**టీ మీడియా, జనవరి 30, టేక్మాల్ ప్రతినిధి:**మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలోని కాకతీయుల కాలంలో నిర్మించినటువంటి తుంబురీశ్వర స్వామి ఉత్సవాలు ఈనెల 30వ తేది నుండి ఫిబ్రవరి1వతేదీ వరకు స్వామివారి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నీ ఆలయ పూజారి వైద్య రవి కోటి రామశర్మ తెలిపారు. ఈ ఉత్సవాలను మదనానంద స్వామి దివ్య ఆశీస్సులతో ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తుంబురీశ్వర స్వామి దేవాలయము కాకతీయుల కాలం నుంచే నిర్మితమైనదని ఇచ్చటగల శిలాశాసనాలు తెలియజేస్తున్నాయి. క్రీస్తుశకం 11 వ శతాబ్దానికి చెందినవి అని ఆలయ శిలా శాసనాలు తెలుపుతున్నాయి దేవ స్థలము బహి ప్రాంగణము పై సంస్కృతిని కనువిందు చేస్తున్నట్టుగా చుట్టు శిల్ప స్తంభాలు మరోవైపు లక్ష్మి మరోవైపు మహంకాళి సరస్వతి దేవి అద్దం చూస్తూ అలంకరించుకున్నట్లు మరో వైపు స్త్రీ పిల్లలకు పాలిస్తున్నతల్లి విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటాయి. 30వ తేదీన మాఘ శుద్ధ ద్వాదశి శుక్రవారం ఉదయం రుద్రా అభిషేకం, వ్యూహ వచనము కలశ స్థాపన శకట ఉత్సవం సాయంత్రం బండ్లు బోనాలు నిర్వహిస్తారు 31 తేదీన గురు వారం స్వామివారికి రుద్రాభిషేకము పుష్పార్చన శకట ఉత్సవం పాచీ బండ్లు. రాత్రి. పల్లకి సేవ. రథోత్సవం. నిర్వహిస్తారు.1వ తేదీన మాఘశుద్ధ పౌర్ణమి రోజున పార్వతి పరమేశ్వరులకు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. మధ్యాహ్నం కుస్తీ పోటీలు నిర్వహిస్తారు.నిత్య అన్నదానం నిత్య భజన సంకీర్తనలు నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమాలకు మాధవానంద సరస్వతి స్వామి పూ"పా" రాజయోగి వెంకటస్వామి ఆత్మనంద ఆశ్రమం రుస్తుం పేట పీఠాధిపతులు ఈ కార్యక్రమానికి విచ్చేయుచున్నారు. అని ఆలయ పూజారి శ్రీ రవి కోటి వైద్య రామ శర్మ ఆలయ కమిటీ భక్త బృందం గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ పాలక వర్గ సభ్యులు గ్రామ పెద్దలు తెలియజేశారు.

## ఆంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవం



**టీ మీడియా జనవరి 29, టేక్మాల్ ప్రతినిధి:**మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కుసంగి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి మూడవ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర మాఘమాస శుద్ధ ద్వాదశి శుక్రవారంతేది : 30-01-2026 రోజున ఆంజనేయ స్వామివారి (3వ.) తృతీయ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా మహోత్సవాలు కొనసాగుతాయని గ్రామీణ ప్రాంతంలో నిర్వహించే ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలు మన హిందూ ధర్మానికి సూచికగా నిలుస్తాయని అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని నిత్యం పూజిస్తే సకల సంతోషాలు కలుగుతాయని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కాగలరని మనవి.కార్యక్రమ వివరములుఉదయం 9 గం,లకు గణపతి పూజ, పుణ్యవచన ఉదయం,10 గంటలకు మన్యుసూక్త సహిత రుద్రాభిషేకంఉదయం 11 గంటలకు రుద్రహోమం, మధ్యాహ్నం 1-30 నిలకు ఆశీర్వచనము, తీర్థప్రసాద వితరణ మధ్యాహ్నం 2 గంటల నుండి అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడును. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు.



## భూగర్భ జలవనరుల గణన

**టీ మీడియా ,జనవరి 29, టేక్మాల్ప్రతినిధి:**మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని గ్రామాలలో జలషయాల గణన పై మండల ఎన్యూమరేటర్లు ఆయా గ్రామంలో నీటి వనరుల రంగంలో వినియోగించుకోవడం కోసం సరైన రీతిలో వినియోగించుకోవడం సమగ్రమైన మరియు విశ్వాసమైన డాటా బేస్ను ఈ సర్వే యొక్క ప్రధాన లక్ష్యం అన్ని టేక్మాల్ తహసీల్దార్ తుల్సిరామ్ తెలిపినారు . ఈ కార్యక్రమం ఎన్యూమరేటర్లు జలాశ్యాయాలు మరియు భూగర్భ జాల సంభంధించిన కచ్చితమైన వివరాలకు మొబైల్ యాప్ ద్వారా బోర్ సర్వే నమోదు చేసినారూ ఈ ప్రణాళిక కలెక్టర్ గారు ఆదేశాల మేరకు 100%గణంగా బోర్ సర్వే పూర్తి చేయడం జరిగింది మండలంలోని జీపీఒ భగవత్ గీత బాల్ రాజ్ టేక్మాల్ మండల పరిధిలోని కోరంపల్లి గ్రామంలో సర్వే జరిపించడం జరిగింది .కోరంపల్లి సర్పంచ్ లక్ష్మి ప్రసన్న వినీత్ కుమార్ .ఉప సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.



## పత్రిక దినోత్సవం వేడుకలు

**టిమీడియా,జనవరి29,ఎండపల్లి:** సమాజంలోజరుగుతున్న అన్యాయాలనుఎండగట్టడంలోనూ,సామాన్యుడి గొంతుకనుప్రభుత్వానికివినిపించడంలోనూ పత్రికలు కీలక పాత్రపోషిస్తున్నాయని తెలంగాణ ఆర్యవైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం అధ్యక్షులు రమేష్ గుప్తా కొనియాడారు. గురువారం జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా రాజారాంపల్లి గ్రామంలోని వివేకానంద విగ్రహం వద్ద ఆయన విలేకరులతో కలిసి కేక్ కట్ చేసి, ప్రయాణికులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రమేష్ గుప్తామాట్లాడుతూ.. అణగారిన వర్గాల సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు విలేకరులు ప్రాణాలకు తెగించి చేస్తున్నకృషిఅభినందనీయమని అన్నారుఈకార్యక్రమంలో మడప సత్యనారాయణ, రమేష్,లక్ష్మణ్,రాజేశ్వర్ రెడ్డి,ప్రయాణికులు,తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి మెదక్ జిల్లాపైనే పార్టీల కన్ను

### మెజారిటీ పురాలను కైవసం చేసుకునేందు కసరత్తు




| మెదక్ జిల్లా మున్సిపాలిటీల వివరాలు | | | |
|---|---|---|---|
| మున్సిపాలిటీ | వార్డులు | ఓటర్లు | పోలింగ్ స్టేషన్లు |
| మెదక్ | 32 | 37,016 | 64 |
| రామాయంపేట | 12 | 13,106 | 24 |
| నర్సాపూర్ | 15 | 17,066 | 30 |
| తూప్రాన్ | 16 | 20,42 | 32 |

| సిద్దిపేట జిల్లా మున్సిపాలిటీల వివరాలు | | | |
|---|---|---|---|
| మున్సిపాలిటీ | వార్డులు | ఓటర్లు | పోలింగ్ స్టేషన్లు |
| గజ్వేల్ | 20 | 46,740 | 71 |
| దుబ్బాక | 20 | 21,346 | 41 |
| హుస్నాబాద్ | 20 | 19.227 | 40 |
| చేర్యాల | 12 | 13,777 | 24 |

**టీ మీడియా ,జనవరి 29,ప్రత్యేక ప్రతినిధి :** తెలంగాణలో వచ్చే నెలలో పురపాలిక ఎన్నికలు నిర్వహించనున్నారు. రేపటితో నామినేషన్? ప్రక్రియకూడా పూర్తికానుంది. అయితే రాష్ట్రంలోనే ఉమ్మడి మెదక్? జిల్లాలో అత్యధికంగా 19 పురపాలికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ జిల్లాలోని మెజారిటీ పురాలను కైవసం చేసుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలన్నీ దృష్టి సారించాయి. అధికార కాంగ్రెస్?, ప్రతిపక్ష బీఆర్?ఎస్?, బీజేపీలు బల్దియా ఛైర్మన్? స్థానాలనే లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతున్నాయి. ఇందులో భాగంగానే వార్డు స్థానాలకు అభ్యర్థులను ఆచితూచి ఎంపిక చేస్తున్నాయి.

**విజయానికి కాంగ్రెస్? ఎత్తుగడలు**

రాష్ట్రంలో జరగనున్న పురపాలిక ఎన్నికలను అధికార కాంగ్రెస్? పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. జహీరాబాద్, మెదక్? లోక్?సభ నియోజకవర్గాలకు మంత్రులు అజారుద్దీన్?, వివేక్?లను ఇన్?ఛార్జులుగా నియమించింది. మంత్రి వివేక్? మెదక్? లోక్?సభ నియోజకవర్గం పరిధిలోని పురపాలికల్లో మెజారిటీ వార్డులను గెలుపొంది ఛైర్మన్? స్థానాలను కైవసం చేసుకునేందుకు అవసరమైన వ్యూహాలను రచిస్తున్నారు. ఆ నియోజకవర్గం పరిధిలోని స్థానికంగా పట్టున్న వారిని గుర్తించే పనిలో ఉన్నారు. అలాంటి వారికే టికెట్లు కేటాస్తున్నారు. దీనితో పాటు జహీరాబాద్? లోక్?సభ నియోజకవర్గం పరిధిలోని మూడు బల్దియాల్లో అభ్యర్థులను ఖరారు చేసేందుకు రెండు రోజుల కిందట మంత్రి అజారుద్దీన్? సమావేశం నిర్వహించారు. దీనిలో ఆ ప్రాంతంలోని పార్టీ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేశారు.

**పకడ్బందీగా ఎంపిక ప్రక్రియను**

దీనితో పాటు అధికార కాంగ్రెస్? పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తోంది. ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, బీఆర్?ఎస్?ల అభ్యర్థుల కంటే దీటైనా వారిని ఎంపికపై కసరత్తు వేగవంతం చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఓ సర్వే బృందం, పీసీసీ అధ్యక్షుడు మహేశ్?కుమార్ గౌడ్? సర్వే బృందంతో పాటు పార్లమెంటు నియోజక వర్గాల పరిధిలో ఆయా మంత్రులు సర్వే బృందాలు అభ్యర్థుల వివరాలు సేకరిస్తున్నాయి. అయితే ఎంపిక ప్రక్రియలో పార్టీ రాష్ట్ర నాయకత్వం జోక్యం తక్కువగా ఉంటుందని ఇప్పటికే పలువురు నేతలు స్పష్టత ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 80 శాతానికి పైగా సర్వే ఫలితాను బేరీజు వేశాక మెరిట్? విధానంతో అభ్యర్థుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశాయి. ప్రజాదరణ, పార్టీ విధేయతకు ప్రాధాన్యత ఉంటుందని నేతలు తెలిపారు.పట్టు నిలుపుకోవాలని బీఆర్?ఎస్? : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఉమ్మడి మెదక్? జిల్లాలో నేటి వరకూ బీఆర్?ఎస్? ఆధిపత్యం కొనసాగిస్తోంది. అయితే బీఆర్?ఎస్? ప్రస్తుత పుర ఎన్నికల్లోనూ పట్టు నిలుపుకోవాలని అడుగులు వేస్తోంది. సంగారెడ్డి జిల్లాలో 11 పురపాలికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్?, మాణిక్?రావులతో పాటు మాజీ ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. వీరికి తోడు పట్టణాల వారీగా ఇన్?ఛార్జులను నియమించి దిశానిర్దేశం చేస్తున్నారు. పార్టీ నుంచి రెబల్ అభ్యర్థులు బరిలోకి దిగకుండా జాగ్రత్త పడుతున్నారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో అత్యధిక స్థానాలను కైవశం చేసుకునేలా ముందుకు సాగుతున్నారు.బీజేపీ పాగా వేయాలని : పట్టణ ప్రాంతాల్లో పట్టున్న బీజేపీ పుర ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు వ్యూహాలను సిద్ధం చేసి అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే మున్సిపాలిటీల వారీగా ప్రభారీలను నియమించారు. సీనియర్ నేతలను భాగస్వాములను చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఓ పురపాలికను దక్కించుకుంటామనే ధీమాతో ఉన్న ఆ పార్టీ నాయకత్వం దానిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. సంగారెడ్డిలో ఐదు బల్దియాల్లో పాగా వేయాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సిద్దిపేటలో రెండు పురపాలికల్లో పాగా వేసేందుకు వ్యూహాలను రచిస్తున్నారు.

## సబ్ సెంటర్‌ను సందర్శించిన

**-జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి**



**టి మీడియా,జనవరి 29,ఎండపల్లి:**జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డిఎంహెచ్ఓ డాక్టర్ సుజాత గురువారం రాజారాంపల్లి సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భనలో భాగంగా సబ్ సెంటర్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి,వైద్య సేవల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.సబ్ సెంటర్ పరిధి లోని హైపర్ టెన్షన్ బీపీ, డయాబెటిస్, లెప్రసీ, టీబీ, ఎన్.సి.డి,కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.కుక్క కాటు, కోతి కాటు నివారణవ్యాక్సిన్లు,ఇతరఅత్యవసరమందుల నిల్వలను ర్యవేక్షించారు. తదానంతరంసమ్మక్క-సారక్కజాతరసందర్భంగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును సందర్శించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగుసూచనలు చేశారు.ఈకార్యక్రమంలో మండలవైద్యాధి కారిడాక్టర్పి.లవకుమార్, డి.పి.ఓ, రవీందర్, డి.పి.హెచ్.ఎన్,జ్యోతి,సూపర్వైజర్, మనోరమ,ఏ.ఎన్.ఎం, పి.లావణ్య, ఎం.పి.హెచ్.ఏ- ఎం,ఎస్. శ్రీనివాస్ ఆశా కార్యకర్తలు జమున, సరస్వతి పాల్గొన్నారు.

## పురపోరు: 'బీ' ఫామ్ టెన్షన్

**ఆగని నామినేషన్ల హోరు!**



**టిమీడియా,జనవరి29,రాజన్న సిరిసిల్ల:** వేములవాడ ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ మున్సిపల్ ఎన్నికల రాజకీయం మునుపెన్నడూ లేనంత ఆసక్తికరంగా మారింది. పట్టణంలోని 28 వార్డుల్లో పాగా వేయడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు వ్యూహాలు రచిస్తుండగా ముఖ్యంగా అధికార పార్టీలో టికెట్ల లొల్లి తారస్థాయికి చేరింది. పార్టీ అధికారికంగా బీఫామ్‌లు జారీ చేయకముందే టికెట్ తమకే దక్కుతుందనే ధీమాతో ఆశావహులు నామినేషన్లు వేస్తుండడం ఇప్పుడు అధికార పార్టీలో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది.వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అండదండలు ఎవరికి ఉన్నాయి అనే ఉత్కంఠ ఒకవైపు కొనసాగుతుండగా ప్రతి వార్డులోనూ ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలు కావడం పార్టీ శ్రేణుల్లో అయోమయాన్ని సృష్టిస్తోంది. తమకు టికెట్ రాదని సంకేతాలు అందిన కొందరు నేతలు ఇప్పటికే ఇతర పార్టీల వైపు చూస్తుండగా మరికొందరు రెబల్స్‌గా బరిలో నిలిచేందుకు.సిద్ధమవుతున్నారునామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే వరకు ఈ ఉత్కంఠ తప్పేలా లేదు. చివరి నిమిషంలో బీఫామ్ ఎవరిని వరిస్తుంది అసంతృప్త నేతలను నాయకత్వం ఎలా బుజ్జగిస్తుంది అనేది ఇప్పుడు పట్టణంలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ఆశావహులు పార్టీ మారి పోటీలో నిలిస్తే అది అధికార పార్టీ ఓటు బ్యాంకుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

## సమగ్ర అభివృద్ధి లక్ష్యం



**టిమీడియా,జనవరి29,దేవరకద్ర :** సమగ్ర అభివృద్ధి బిజెపి లక్ష్యంగా అడుగులు వేస్తుందని బిజెపి పార్లమెంట్ కన్వీనర్ డోఖ్బూర్ పవన్ కుమార్ రెడ్డి అన్నారు. దేవకద్ర నియోజకవర్గం కేంద్రంలో మహబూబ్ నగర్ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి నాయకత్వంలో అశోక్ సాగర్ బిజెపి మండల ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో చౌదర్పల్లి గ్రామ మాజీ సర్పంచ్ నంది కురుమయ్య, తో పాటు పలువురు నాయకులు బిజెపి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, దొడ్ల శ్రీను, చౌదర్పల్లి గ్రామ బిజెపి అధ్యక్షులు శంకర్, ఉపాధ్యక్షుడు మల్లేష్, శ్రీశైలం, వెంకటేష్, మహేష్, ముఖ్య నాయకులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాగ్రత్తగా వ్యవహరించాలి

**జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్**



**టిమీడియా,జనవరి29,మంచిర్యాల, జనవరి 28:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, కలెక్టరేట్ ఏఓ పిన్న రాజేశ్వర్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచా యతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన అనుభవంతో మున్సిపల్ ఎన్నికల నిర్వ హణ ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని, ఈ నెల 30 వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొ రేషన్ పరిధిలోని 60 డివిజన్లకు సంబంధించి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారిని అనుమతించడం జరగదన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ (08736-250501) ఏర్పాటు చేశామని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదులకు సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బెల్లంపల్లి: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం బెల్లంపల్లిమున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జె.సంపత్ తో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో పని చేయాలని సూచించారు.

టి- మీడియా న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
GST IN - 36FDKPS 1308PZX
అన్ని పార్టీలు వారికి రాజకీయ ఉపన్యాస పాయింట్స్
- ప్రత్యేక (డిజిటల్, ప్రింట్) సంచికలు
- సోషల్ మీడియా సర్వీసెస్
- పత్రికలకు వార్తలు, స్టోరీలు
- అన్నిరకాల యాడ్స్ డిజైనింగ్
tmedia.net.in, epaper.tmedia.net.in, News Agency & Media Consultancy, Youtube Channel, Facebook, Instagram, Twitter
ప్రెస్‌మీట్ ఏర్పాటు, ప్రెస్‌నోట్లు తయారీ, ప్రత్యేక దిన పత్రిక డిజిటల్ ఎడిషన్‌లు కోసం
దేశంలో ఎక్కడి వారు అయిన సంప్రదించండి :
8919710365 కు కాల్ చేయండి

# ఫోన్ ట్యాపింగ్ లో కీలక పరిణామం

**- కేసీఆర్‌కు సిట్ నోటీసులు**

**టీ మీడియా, జనవరి 29 , హైదరాబాద్ బ్యూరో :** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్? అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్?కు సిట్? అధికారులు నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్? నందినగర్?లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. రేపు మధ్యాహ్నం మూడు గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. 65 ఏళ్ల వయసు దృష్ట్యా పీఎస్?కు రావాల్సిన అవసరం లేదని తెలిపారు. విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్ పరిధిలోని అనువైన ప్రాంతం వివరాలు తెలపాలని సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే కేటీఆర్?, హరీశ్?రావు, సంతోశ్? రావులను ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించిన విషయం విధితమే.

**ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు వేగవంతం**

రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తును వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీసు అధికారులను అరెస్ట్ చేయగా, ప్రభాకర్ రావును సైతం పలుమార్లు ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. ఈ కేసులో చిన్న చిన్న గ్యాప్స్?ను కూడా ఫిల్ చేస్తూ సీపీ సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ ముందుకు వెళ్తోంది. ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు విచారణ కస్టోడియల్ విచారణ ఆధారంగా కీలక సమాచారాన్ని సేకరించింది. ఇప్పటికే ట్యాపింగ్ బాధితులుగా ఉన్న మొత్తం 618 మందిని దాదాపు అందరి స్టేట్మెంట్?ను రికార్డ్ చేసిన సిట్ అధికారులు, ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ తర్వాత మరికొంతమందిని పిలిచి విచారిస్తున్నారు.ఎస్?ఐబీ ఏఎస్పీ ఇచ్చిన ఫిర్యాదుతో : స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అదనపు



సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2024 మార్చి 10న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైంది. అప్పటి నుంచి ఈ కేసు అనేక కీలక మలుపులు తిరుగుతూ, అక్రమ నిఘాకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలను వెలుగులోకి తెచ్చింది. వీసీ సజ్జనార్ నాయకత్వంలో మరో సిట్ ఏర్పాటు చేసిన తర్వాత దర్యాప్తు మరింత వేగవంతమైంది. దీని తర్వాత సిట్ ఇటీవల ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్‌లను విచారించింది. వారి వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు, విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీశారు.అనేక వాంగ్మూలాల్లో కేసీఆర్ పేరు వెలుగులోకి రావడంతో, ఇప్పుడు ఆయనకు నోటీసులు జారీ చేయాలని సిట్ నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రాధాకిషన్ రావు తన వాంగ్మూలంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ పాత్ర గురించి ప్రస్తావించినట్లు ఆరోపణలు వచ్చాయి. భుజంగ రావు కూడా ప్రభాకర్ రావు నియామకం గురించి ప్రస్తావిస్తూ కేసీఆర్ పేరు చెప్పినట్లు సమాచారం. ఈ కేసులో పాలుపంచుకున్న సీనియర్ అధికారులు సంబంధిత కాలంలో మాజీ ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన ప్రగతి భవన్‌ను తరచుగా సందర్శించారని భుజంగ రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈ వాంగ్మూలాలు, వాటికి మద్దతుగా లభించిన ఆధారాల ఆధారంగా సిట్ తన దర్యాప్తును ముందుకు తీసుకెళ్తుందని భావిస్తున్నారు. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడంతో దర్యాప్తు కీలక దశలోకి ప్రవేశించింది. రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.ఇటీవలే కేటీఆర్?ను లోతుగా విచారించిన సిట్ : ఫోన్? ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్?ను ఇటీవల ప్రత్యేక దర్యాప్తు బృందం లోతుగా విచారించింది. ఆయనను పలు అంశాలపై అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. పార్టీకి ఎలక్ట్రోరల్ బాండ్లు, విరాళాలు సమకూర్చిన వారిలో పలువురు వ్యాపారుల మొబైల్స్? నిఘాలో ఉన్నట్లుగా సిట్?కు ఆధారాలు లభించాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు పలు ప్రశ్నలు అడిగినట్లుగా తెలిసింది. ఆయా ఫోన్? నెంబర్లతో ఉన్న జాబితాను కేటీఆర్? ముందు ఉంచి విచారించినట్లు సమాచారం. అలాగే ఫోన్? ట్యాపింగ్? ద్వారా తమను బెదిరించి బీఆర్?ఎస్?కు ఎలక్ట్రోరల్? బాండ్లు సమకూర్చే విధంగా చేశారంటూ కొంతమంది వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదులపై ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని కేటీఆర్? సమాధానం ఇచ్చారు. వ్యాపారులు తమకు స్వచ్ఛందంగానే విరాళాలను ఇచ్చారని చెప్పినట్లు సమాచారం.



బీ-ఫారాలపై ...

## ఆచితూచి అడుగులు

**-చివరి వరకు ఉత్కంఠే!**

**టీ మీడియా, జనవరి 29 , హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైందో లేదో టికెట్ల కేటాయింపు విషయంలో ప్రధాన పార్టీల ముఖ్య నేతలు వివాదాలను ఎదుర్కొంటున్నారు. మరో పక్క బీ-ఫారమ్? 'నాకు దక్కుతుందా లేక చివరి నిమిషంలో పార్టీ వేరే వారికి ఇస్తుందా' అని ఆశావహులు మల్లగుల్లాలు పడుతున్నారు. రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మొత్తం 2,996 డివిజన్లు, వార్డులకు ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్?, బీఆర్?ఎస్?, బీజేపీ, ఎంఐఎం, వామపక్షాలు తదితర పార్టీల్లోనూ నాయకులు పోటీ చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్ల ఖరారులో చాలా పార్టీలు ఆలస్యం చేస్తున్నాయి. ఇప్పుడే అధికారికంగా ప్రకటిస్తే టికెట్? లభించని వారిలో అసంతృప్తి రాజుకుంటుందని, అందుకే నామినేషన్ల చివరి రోజున అభ్యర్థులకు బీ-ఫారాన్ని ఇవ్వాలని భావిస్తున్నాయి. దీనివల్ల పోటీపడుతున్న ఇతరులను బుజ్జగించడానికి, అలాగే టికెట్? దక్కని వారు ఇతర పార్టీల నుంచి పోటీ చేసే అవకాశం ఉండదని లెక్కలేస్తున్నారు.ఉమ్మడి మహబూబ్?నగర్ జిల్లాలో పోటీ చేయాలనుకునేవారు టికెట్ ఖరారు కాలేదు. అయినప్పటికి అక్కడ ఇంటింటి ప్రచారాల్లో నిమగ్నమయ్యారు. ఇక్కడ ఒక కార్పొరేషన్?తోపాటు 18 బల్దియాల్లో పోటీ దారులెవరనేది ఇంకా ఏ పార్టీ కూడా తేల్చలేదు. అయితే కొంతమందికి రహస్యంగా టికెట్? మీకు పక్కా అనే సంకేతాలిచ్చినా ఎక్కువ మంది ఈ విషయంలో తీవ్రంగా చర్చిస్తున్నారు.ఉమ్మడి కరీంనగర్? జిల్లాలో ఓ జాతీయ పార్టీ పోటే చేసే వారు ఎవరనేది అధికారికంగా ఇంకా చెప్పనే లేదు. కానీ నామినేషన్?లు దాఖలైన తీరుని అంచనా ప్రకారం అభ్యర్థులకు రహస్యంగా బీ-పారాల్ని అందించాలని పరిశీలిస్తుంది.నల్గొండ కార్పొరేషన్?లోని 48 డివిజన్లలో కాంగ్రెస్? నలుగురిని, బీఆర్?ఎస్? 18 మందిని అభ్యర్థులుగా ప్రకటించాయి. కాని ఇప్పటివరకు బీజేపీ ఒక్క అభ్యర్థిత్వాన్నీ తెలియజేయలేదు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎన్నికలు జరిగే 17 పురపాలక సంఘాల్లోని 359 వార్డుల్లో మెజారిటీ స్థానాల్లో ఏ పార్టీ కూడా అభ్యర్థులను వెల్లడించలేదు.కరీంనగర్?, నిజామాబాద్?, రామగుండం కార్పొరేషన్?లలో కార్పొరేటర్లు కావాలనుకునే వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. కరీంనగర్?లో కాంగ్రెస్? పార్టీ తరఫున పోటీ చేసేందుకు మొత్తం 334 మంది అర్జీలు పెట్టుకున్నారు. అలాగే బీజేపీలో 200 మందికి పైగా ఆశావహులున్నాయి.ఉమ్మడి మెదక్? జిల్లాలో ఓ పార్టీ కొన్ని మున్సిపాలిటీల్లో రెబెల్స్? బెడద లేని చోట అభ్యర్థులను ప్రకటించింది. ఇటీవల మాజీ కౌన్సిలర్లకు ప్రాధాన్యం ఇచ్చింది. దీంతో ఈసారి మెజారిటీ స్థానాల్లో ఇక్కడ మూడు ప్రధాన పార్టీలూ బీ-ఫారాల ఇవ్వడం విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నాయి. ఆ పార్టీ ప్రత్యర్థుల ఆధారాల వ్యూహాలు వేస్తున్నాయి.

**తొలిరోజే 902 నామినేషన్లు దాఖలు**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్? ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజే 902 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో అత్యధికంగా కాంగ్రెస్? నుంచి 382, ఆమ్? ఆద్మీ పార్టీ నుంచి అత్యల్పంగా ఒకటి దాఖలైంది. అయితే ఈ గడువు శుక్రవారంతోనే ముగిసిపోతుండటంతో మరో రెండు రోజుల్లో నామినేషన్ల పత్రాలు పోటెత్తనున్నాయి. రాష్ట్రంలోని ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఫిబ్రవరి 11న ఎన్నికలు జరిపేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్? మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా పవార్ భార్య

**టిమీడియా,జనవరి29, ముంబై :** మహారాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన అజిత్ పవార్ దుర్మరణంతో తదుపరి డిప్యూటీ సీఎం ఎవరు? నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని నడిపించేది ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు పవార్ స్థానాన్ని ఆశిస్తున్నారు. అయితే.. కొందరు సీనియర్ నాయకులు మాత్రం ఆయన భార్య సునేత్ర పవార్ పేరును ప్రతిపాదిస్తున్నారు. అజిత్ దాదా వారసత్వాన్ని కొనసాగించేందుకు సునేత్రనే సరైన వ్యక్తి అని, అందుకని ఆమెను ఉపముఖ్యమంత్రిగా చూడాలని వారందరూ ఆశపడుతున్నారు.జడ్జీ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా బారామతిలో విమానం కుప్పకూలడంతో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం చెందారు. రాజకీయ చతురుడిగా పేరున్న అజిత్ మరణంతో ఎన్సీపీ నుంచి ఉప ముఖ్యమంత్రి పదవి కోసం పలువురు అశావహులు పోటీలో ఉన్నారు. కానీ, సీనియర్లు అజిత్ భార్య సునేత్ర వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగుతున్న ఆమెను డిప్యూటీ సీఎం చేయాలనుకుంటున్నారు. ఎన్సీపీ నాయకుడు, మంత్రి నరహరి జిర్వాల్ గురువారం పీటీఐతో మాట్లాడుతూ.. 'సునేత్రను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నార'ని తెలిపాడు.ఇప్పటికే సీనియర్లు ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బల్, ధనంజయ్ ముండు, సునీల్ తట్కరేలు సునేత్రను పరామర్శించి భవిష్యత్ ప్రణాళికలపై మంతనాలు జరిపారు. అజిత్ పవార్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైన బారామతి నియోజకవర్గం నుంచి సునేత్రను బరిలో ఉంచాలని.. ఆపై ఆమెకు డిప్యూటీ సీఎం పదవిని కట్టబెట్టాలని వారు భావిస్తున్నారు. ఎన్సీపీ సీనియర్లు త్వరలోనే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసి ఆయనతో ఇదే విషయమై చర్చించేందుకు సిద్ధముతున్నారు.



# కార్మిక సేవలకే ప్రాధాన్యత

**మందమర్రి జీ.ఎం రాధాకృష్ణ**

**టిమీడియా,జనవరి29,బెల్లంపల్లి:** సింగరేణి యజమాన్యం కార్మికుల వైద్యసేవల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ అన్నారు. గురువారం మందమర్రి కేకే1 డిస్పెన్సరి ఆవరణలో నూతనంగా నిర్మించిన ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందమర్రి ఏరియాలోని కార్మికులు,రిటైర్డ్ కార్మికులకు ఈ సెంటర్ ఏర్పాటుతో ఎంతో లాభం జరుగుతుందన్నారు. ప్రతీ దానికీ మందులు మింగడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయని అన్నారు. కీళ్ల సమస్యల్లో సింహభాగం ఎక్సర్సైజ్, ఫిజియో థెరపీ ల ద్వారా నివారించవచ్చున్నారు. గతంలో మనుషులు చాలా కష్టపడేవాళ్లని,కానీ నవీన సమాజంలో కష్టం తగ్గిందన్నారు. ఫలితంగా చాలా జబ్బులు వస్తున్నాయన్నారు. అందుకే జీవితంలో మార్నింగ్ వాక్, ఎక్సర్సైజ్ ను అలవాటు చేసుకోవాలన్నారు.ఫిజియో సెంటర్ ను అవసరం మేరకు పరికరాలను పెంచి ఆధునీకరిస్తానని హామీ ఇచ్చారు. గుర్తింపు కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి సలేశ్రీద్ర సత్యనారాయణ మాట్లాడుతూకార్మికులు సింగరేణి కల్పిస్తున్న వైద్యసేవలను ఉపయోగించుకోవాలన్నారు. కేకే1 డిస్పెన్సరీలో హెచ్ 1బిఏ సి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ నిర్ధారిత రక్త పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీ వైసీఎంఓ,డాక్టర్ మధుకుమార్ మాట్లాడుతూ ఫిజియో థెరపీ ద్వారా పలు లాభాలుంటాయన్నారు. ఎస్ వో టు జీ ఎం జీ.ఎల్.ప్రసాద్,ఇ+వీ పర్సనల్ అశోక్, సివిల్ ా.జు శ్రీధర్,మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.నాగేశ్వర్ రావులు, డిస్పెన్సరీ ప్రధాన కార్యనిర్వహణ క్లర్క్ హెచ్. రవీందర్, ఏఐటీ యూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ రమణ ,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




**జీఎంను సన్మానించిన రిటైర్డ్ కార్మికులు..**

మందమర్రి ఫిజియో థెరపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎ న్.రాధాకృష్ణ, డీ.వై.సి.ఎం.వో. డాక్టర్ మధుకుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.నాగేశ్వర్ రావులు సింగరేణి రిటైర్డ్ కార్మికులు శాలువాలు కప్పి సన్మానించారు. రిటైర్డ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్,దాసరి రామన్న, కంబాల రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య భవనాల తనిఖీలు

**-ఏవీ రంగనాథ్**



**టిమీడియా,జనవరి29, హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్ నగరంలోని అన్నీ రకాల వాణిజ్య భవనాల్లో తనిఖీలకు హైడ్రా సిద్ధమైంది. అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యంగా రద్దీ ప్రాంతాల్లోని వ్యాపార కేంద్రాలను గురువారం నుంచి తనిఖీలు చేపట్టనున్నట్లు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలో నాంపల్లిలో అగ్ని ప్రమాదానికి కారణాలను అంచనా వేశామని, అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. బుధవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రకటించారు.ఆ భవనాలకు విద్యుత్తు ఆపేయండి : వ్యాపార సముదాయాలు, గృహోపకరణాలు, వస్త్ర తదితర విక్రయ కేంద్రాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆయా శాఖలకు హైడ్రా కమిషనర్ స్పష్టంచేశారు. అగ్నిమాపక చర్యలు పాటించని భవనాలకు వెంటనే కరెంట్ కనెక్షన్ నిలిపేయాలని, భవనంలోని లోపాలను తెలుపుతూ భవనం ముందు బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.మీ వివరాలు చాలా గోప్యంగా ఉంటాయి : అగ్నిప్రమాదం జరిగితే తప్పించుకునే దారిలేని దుకాణాలు, కాంప్లెక్సుల వివరాలను గుర్తిస్తే హైడ్రా కంట్రోల్‌రూం చరవాణి సంఖ్య 90001 13667ను సంప్రదించి ఆయా కాంప్లెక్సుల పేర్లు, ప్రాంతం, ఇతర సమాచారమివ్వాలని రంగనాథ్ నగర ప్రజలకు పిలుపునిచ్చారు. కుదిరితే ఫొటోలు, వీడియోలను పంపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. హైదరాబాద్?లో గత ఏడాది 36 ప్రమాదాలు జరిగాయని, సగటున నెలకు మూడు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తరలించకపోతే తాళమేస్తాం : నాంపల్లిలో ఫర్నీచర్ దుకాణం సెల్లార్‌లో భారీగా గృహోపకరణాలను నిల్వ ఉంచారని హైడ్రా కమిషనర్? వీడియో సందేశంలో తెలిపారు. సెల్లార్?లో చిక్కుకున్నవారు క్షణాల్లో ప్రాణాలు కోల్పోయారన్నారు. సెల్లార్? దుర్వినియోగం చేయడంతోనే ప్రాణ నష్టం జరిగిందని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. సెల్లార్లలో పేలుడు స్వభావం, మండే లక్షణాలున్న వస్తువులను భద్రపరిస్తే హైడ్రా కఠిన చర్యలు తీసుకుంటుంది.అగ్ని వ్యాపించినప్పుడు మంటలను వెంట వెంటనే ఆర్పేసే సిలిండర్లు, స్ప్రింక్లర్లు అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉండాలి. భవనం పైకప్పు, వెలుపల వాటర్ ట్యాంకు తప్పనిసరి.షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకున్నప్పుడు దుకాణాల్లోని వినియోగదారులు జాగ్రత్తగా బయటకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ దారి, దాన్ని సూచించే సిగ్నల్ బోర్డులు తప్పనిసరిగా ఉండాలి.నాంపల్లిలో ఫర్నీచర్ దుకాణం సెల్లార్‌లో భారీగా స్థాయిలో గృహోపకరణాలను నిల్వ ఉంచారు. దాని కారణంగానే సెల్లారులో చిక్కుకున్న 5 మంది మరణించారు. సెల్లార్?ను దుర్వినియోగం చేయడంతోనే ప్రాణ నష్టం జరిగింది. ఫైర్? సెఫ్టీ తీసుకోకుండా ఎవరైతే భవనాలను నిర్వహిస్తున్నారో వాటిపై చర్యలు తీసుకోవడానికి హైడ్రా అధికారులు, సిబ్బంది సమాయత్తం అయ్యింది. ఎలకైచే నిబంధనలు పాటించరో వాటిని సీజ్? కూడా చేస్తాం. చట్టపరంగా ఏమేం చర్యలు తీసుకోవాలో అవి కూడా చేస్తాం. వెంటనే విద్యుత్తు కనెక్షన్ కూడా తీసేస్తాం. ఫైర్? యాక్సిండెంట్లు కాకుండా ఉండే విధంగా చూడటానికి మేం సిద్ధంగా ఉన్నాం"-ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్నాంపల్లిలోని బచాస్ ఫర్నీచర్ షాపులో గత శనివారం జనవరి 24వ తేదీన భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం ఇద్దరి చిన్నారులతో సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో అప్రమత్తమైన హైడ్రా వాణిజ్యపరమైన సముదాయలను తనిఖీలు చేయాలని నిర్ణయించింది.

## పాత బంగారం ఇచ్చి , కొత్త బంగారంతో ఉడాయింపు

**-10 తులాల నకిలీ ఇచ్చిన దుండగులు**



**టిమీడియా,జనవరి29, హైదరాబాద్ బ్యూరో:** బంగారం ధరలకు రెక్కలు రావడంతో పసిడి పరుగులు తీస్తోంది. ఇంట్లో ఉన్న కొద్దిపాటి పాత బంగారాన్ని మార్చుకుని, కొత్త నగలు తెచ్చుకోవడం లేదా ఉన్న బంగారం అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు చాలా మంది. ఇదే అదనుగా కొందరు కొత్త తరహా మోసాలకు తెర లేపుతున్నారు. ఏకంగా బంగారు దుకాణం యజమానులనే బురిడీ కొట్టిస్తున్నారు. మాటల్లో పెట్టి మాయ చేసి నకిలీ బంగారం అంటగడుతున్నారు. మరి వారు ఎలా మోసం చేస్తున్నారు? బంగారం పరీక్షలు చేసినా ఎలా బురిడీ కొట్టిస్తున్నారో ఈ కథనంలో చూద్దాం.

**నకిలీ బంగారం ఎలా అంటగట్టారు..?**

పాత బంగారం మార్చి, కొత్త నగలు చేయించుకోవాలంటూ వారు బంగారం దుకాణంలోకి అడుగుపెట్టారు. కొత్త మోడల్స్ ఏమేమి ఉన్నాయో చూపించాలంటూ దుకాణ యజమానిని మాటల్లో దింపారు. తమ వద్ద ఉన్న బంగారానికి ఎంత డబ్బులు వస్తాయంటూ ఆరా తీశారు. ఆ మాట ఈ మాట కలిపి దుకాణం యజమాని నమ్మకాన్ని చూరగొన్నారు. మంచి బేరం దొరికిందని యజమాని సైతం సంబరపడ్డాడు. వాళ్ల దగ్గర ఉన్న బంగారం నాణ్యమైనదో కాదో కూడా పరీక్షలు చేయించాడు. అయినా చివరికి బోల్తాపడ్డాడు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓ బంగారం దుకాణానికి తమిళనాడుకు చెందిన బోయ రాధ, ధనరాము, నాగసూరి వచ్చారు. బంగారం దుకాణంలో నగలు పరిశీలించి బంగారం కొనుగోలు చేయడానికి వచ్చినట్లు యజమానిని నమ్మించారు. అయితే తమ వద్ద పాత నగలు ఉన్నాయని, వాటిని మార్చుకుని కొత్త నగలు ఇవ్వాలని కోరారు. దీనికి దుకాణం యజమాని సరేనన్నాడు. వారి వద్ద ఉన్న బంగారం ఆభరణాలు తీసి యజమాని చేతికి ఇచ్చారు. వాళ్లు తీసుకొచ్చిన నగలు సరైనవో కాదో పరీక్షించడానికి వారిని తీసుకుని వేరే దుకాణం వద్దకు వెళ్లాడు . అక్కడ బంగారం ప్యూరిటీ పరీక్షలో అవి నిజమైన నగలేనని తేలడంతో వాటిని అక్కడే వారి చేతికిచ్చాడు.

**10 తులాల నకిలీ బంగారం :** బంగారం ఒరిజనలేనని తేలడంతో యజమాని తన దుకాణంలో కొత్త నగలు వారికి చూపించాడు. వాళ్లు 7 తులాల కొత్త బంగారు ఆభరణాలు తీసుకుని, తమ వద్ద ఉన్న 10 తులాల బంగారం దుకాణం యజమానికి అప్పగించారు. అన్ని లెక్కలు చూసి కొత్త బంగారంతో పాటు కొంత నగదు సైతం వారికి ఇచ్చి దుకాణం యజమాని వారిని అక్కడి నుంచి పంపించేశాడు. తీరా వారు వెళ్లిన తర్వాత చూసుకుంటే 10 తులాల బంగారం నకిలీదని తేలి లబోదిబోమన్నాడు.

**యాజమానికి నకిలీది అంటగట్టిన కిలేడీలు**

బంగారం పరీక్షించినప్పుడు బాగానే ఉంది కదా మరి తప్పు ఎక్కడ జరిగిందబ్బా అంటూ దుకాణం యజమాని తలపట్టుకున్నాడు. అయితే బంగారం పరీక్షించినప్పుడు నిజంగా అది ఒరిజనల్ బంగారమే. కానీ ఎప్పుడైతే ఆ బంగారం పరీక్ష చేసిన తర్వాత అది వారి చేతికిచ్చాడో అప్పుడే ఆ కిలేడీలు మాయ చేశారు. అసలు బంగారాన్ని బ్యాగ్‌లో పెట్టుకుని అచ్చం అలాగే ఉన్న నకిలీ బంగారాన్ని దుకాణ యజమానికి అంటగట్టారు. మోసపోయానని గ్రహించిన బంగారం దుకాణ యజమాని పోలీసులను ఆశ్రయించగా సీసీ ఫుటేజీ ఆధారంగా ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. బంగారు దుకాణాలే లక్ష్యంగా ఈ ముఠా మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే తరహా నేరాలకు పాల్పడినట్లు తెలిపారు.




## అధిష్టానం నిర్ణయమే ఫైనల్

- సీనియర్ల సలహాలు, సూచనలు పరిగణలోకి..
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**టిమీడియా,జనవరి29,మహబూబ్ నగర్:** పార్టీ లైన్ ఎవరు దాటకూడదని.. ఒక్కరు రెండు నామినేషన్లు వేస్తే ఎట్టి పరిస్థితుల్లో పరిగణలోకి తీసుకోమని బహిష్కరించడం జరుగుతుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.గతంలో పట్టణాన్ని ఆగం చేశారని, గడిచిన 75 సంవత్సరాల కాలవ్యవధిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. పట్టణాన్ని ఆగం చేసి కాలయాపన చేశారని అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు అడుగులు వేస్తున్నామని తెలిపారు. అతి తక్కువ కాలంలో రూ. 2 వేల కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. మన ప్రాంతానికి కావలసిన అన్ని సదుపాయాలను సమకూర్చుతున్న సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో పూర్తిస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాలమూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తో పాటు అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీలో 30,40 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారి సూచనలను సలహాలు తీసుకొని పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చిన అందరూ మద్దతు తెలిపేలా కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. తమతోపాటు కాంగ్రెస్ పార్టీ మూడు సర్వేలను చేయడం జరుగుతుందని జనాదరణ పొందిన నేతలకు టికెట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ పత్రంలో కూడా ప్రతి ఒక్కరూ ఐఎన్సి అని రాయాలని, అలాకాకుండా ఎవరి ఇష్టానుసారంగా వారు నామినేషన్ల దాఖలు చేస్తే పార్టీ బహిష్కరించే అవకాశం కూడా ఉందన్నారు. మేయర్ నేనంటే నేను అని డిప్యూటీ మేయర్ నేనే అని చెప్పుకోవడం సరికాదని మీడియా కూడా ఇస్తాను సారంగా ఈ విషయంలో హైప్ చేయకూడదని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడంతో పూర్తిస్థాయిలో పార్టీ అధిష్టానం అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని ఎవరు మేయర్? ఎవరు డిప్యూటీ మేయర్?నిర్ణయించడం జరుగుతుందని ఈ విషయాన్ని కార్యకర్త గమనించాల్సిన బాధ్యత ఉందన్నారు. టికెట్ రానివారు స్వచ్ఛందంగా పార్టీ లైన్ ఎట్టి పరిస్థితుల్లో దాటకూడదు తెలిపారు. కొత్త కాంగ్రెస్ బిచ్చగా పార్టీ ముందుకు సాగుతుందని ఏదో జరిగిపోతుందని ఎవరు అనుకోకూడదని తెలిపారు. అందరి అభిప్రాయాలను తీసుకొని ముందుకు సాగుతుందని తెలిపారు.

**పట్టణాన్ని ఆగం చేసింద్రు**

సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగెలిపి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు గతంలో పూర్తిస్థాయిలో పట్టణాన్ని ఆగం చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. అందర్నీ సమన్వయం చేసేందుకు ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే పలువురికి పద్ధతులు అప్పగించడం జరిగిందని తెలిపారు. మంచి రోజులు అనుకూలమైన రోజులు అంటూ నామినేషన్లు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఐఎన్సి అని రాయాలని, ఒకరు ఒకటే నామినేషన్ వేయాలని రెండో దానికి అవకాశం లేదన్నారు. పార్టీ లైన్ దాటితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దేవరకద్రలో మొదటిసారి మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయని, భూత్పూర్ లో కూడా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, ఎన్పి వెంకటేష్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్ల కొత్వాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సిహ రెడ్డి, మత్స్య సహకార జిల్లా చైర్మన్ గోనెల శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.